ప్రజాశక్తి
ఆదివారం 14 సెప్టెంబర్ 2025 5 అనంతపురం

హక్కుల హరింపు..!

కార్మికుల

రాష్ట్ర మహాసభల జెండాను ఎగురవేస్తున్న ప్రతినిధులు

- కార్మికులను విస్మరిస్తూ పాలన
- ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వాల మెడలు వంచాలి
- ఎపి మధ్యాహ్న భోజన పథకం జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని
- అనంతలో ఘనంగా యూనియన్ రాష్ట్ర మహాసభలు
- పాల్గొన్న రాష్ట్ర ప్రతినిధులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికుల హక్కులను హరిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయాలు చేస్తుంటే దానికి తలుపుతూ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పాలన సాగించడం అత్యంత దుర్మార్గమనిఎపి మధ్యాహ్న భోజన పథకం జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపి మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలు అనంతపురం గణేనాయక్ భవన్‌లో శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరలక్ష్మి, ఎం.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన మహాసభలకు ఆల్‌ఇండియా ప్రధాన కార్యదర్శి మాలినితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా రంజనా నీరులా ప్రాంగణంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి జెండాను ఎగురవేశారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టి ఇటీవల మరణించిన మధ్యాహ్న భోజన కార్మికులు, ఇతర కార్మికులు, నేతలకు జోహార్లు అర్పించారు. రాష్ట్ర కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టి మూడు సంవత్సరాల్లో చేపట్టిన కార్యక్రమాలు వివరించారు.

అనంతరం నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో మాలిని ప్రసంగించారు.

అనునిత్యం రాజకీయ వేధింపుల : మాలిని

దయా రమాదేవి

ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలోనూ మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులకు గురి చేస్తూ తొలగింపులు చేస్తున్నారని మాలిని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులుగా 30, 40 సంవత్సరాలుగా సేవలందించినా కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపై ఇవ్వడం లేదన్నారు. రోజువారి కనీస వేతనం రూ.100 ఇస్తున్నారంటే ప్రభుత్వాలు వీరిని ఏ విధంగా గుర్తిస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు సంఖ్య పెరిగిందంటే అది మధ్యాహ్న భోజనం పథకం ద్వారానే అన్నారు. కార్మికులు వ్యయప్రయాశలకు ఓర్చి విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నారని చెప్పారు. ఇంత కష్టపడుతున్న కార్మికులను గుర్తించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు దేశ వ్యాప్తంగా కనీన వేతనం రూ.10 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా కలిపి వేతనం ఇవ్వాలన్నారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటుకు అప్పగించరాదన్నారు. మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

పోరాటమే మార్గం

దయా రమాదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసేలా కుట్రలు చేస్తోందన్నారు. వీటిని ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలన్నారు. బిజెపి ప్రభుత్వం మతతత్వ విధానాలతో కార్మికుల మధ్య చీలిక తెచ్చి పాలన కొనసాగిస్తోందన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, మురళి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన

మహాసభల్లో మాట్లాడుతున్న ఆలిండియా కార్యదర్శి మాలిని

పథక కార్మికుల పక్షాన సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ కోశాధికారి సుప్రజ, ఆఫీస్ బేరర్స్ మహాలక్ష్మి, సుధా, శివకుమారి, విజయమ్మ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, అంగన్‌వాడీ అధ్యక్షురాలు శకుంతల హాజరై సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ప్రతినిధులు

కలెక్టర్‌గా ఓ.ఆనంద్

బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం జిల్లా నూతన కలెక్టర్‌గా ఓ.ఆనంద్ బాధ్యతలను స్వీకరించారు. శనివారం మధ్యాహ్నం అనంతపురం ఆర్అండ్‌బి అతిథి గృహానికి చేరుకోగానే జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఏ.మలోల, తహశీల్దార్ హరికుమార్, ఆర్అండ్‌బి ఎస్ఈ మురళీకృష్ణ, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీఆర్ఎస్ఎ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు తదితరులు స్వాగతం పలికి పూలమొక్కలు, పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకన్నారు. వేదపండితుల ఆశీర్వాదాల అనంతరం కలెక్టర్‌గా ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్‌కు ఆర్డీవోలు వసంత బాబు, శ్రీనివాస్, కేశవ నాయుడు, కలెక్టరేట్ సెక్షన్ల సుపరింటెండెంట్లు యుగేశ్వరి దేవి రియాజుద్దీన్, వసంతలతతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పూల మొక్కలు, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లాను ముందుకు నడిపిస్తా : కలెక్టర్

అందరి సహకారంతో అనంతపురం జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని నూతన కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ రాయలసీమకు సంబంధించి కొంతవరకు నీటి, ఇతర సమస్యలు ఉంటాయన్నారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్ తదితర రంగాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తాను రాయలసీమ జిల్లాల్లో మొదటిసారి పనిచేస్తున్నానని, జిల్లాని అర్థం చేసుకుని అందరిని సమన్వయంతో అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కషి చేస్తానని తెలియజేశారు.

అన్ని శాఖల సమన్వయంతో ముందుకు

జిల్లా అభివృద్ధికి ఆయా శాఖల అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో ఆయా శాఖల పరిధిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తే తప్ప పరిష్కారం కాదు అనే సమస్యలను తెలపాలని సూచించారు. జిల్లాలో యూరియాకు కొరత లేకుండా చూడాలన్నారు. సత్యసాయి తాగునీటి పథకంకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంయ అనంతరం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఏ.మలోలతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈత, రైఫిల్ షూటింగ్‌లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

జిల్లాలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. పోటీలను అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల ఛైర్మన్ అనంతరాముడు, పాఠశాల ముఖ్య నిర్వాణాధికారి నరసింహారావు, పాఠశాల ప్రిన్సిపాల్ శాలిని ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 63 మండలాల నుంచి అండర్-14, అండర్-17, అండర్-19 కేటగిరీలో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ ప్రదర్శించిన బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల పాఠశాల క్రీడా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, ఎపి శాప్ రాష్ట్ర అధ్యక్షులు, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్‌రెడ్డి, ఓబులేసు, సమీర, రేఖ, లీలారాణి, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా ఉత్సవాలు

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి అధ్యక్షులు బొప్పరాజు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి ఆధ్వర్యంలో నవంబర్ 7, 8, 9వతేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను అనంతపురం జిల్లాలోని ఆర్‌డిటి మైదానంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రామిశెట్టి వెంకటరాజేష్ తెలిపారు. శనివారం నగరంలోని కృష్ణకళా మందిరం ప్రాంగణంలో ఉన్న రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకుల నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకూ ఉద్యోగులు తీవ్రమైన ఒత్తిడి గురవతుంటారన్నారు. వారందరికీ క్రీడా ఉత్సవాలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. ఉత్సవాల్లో విఆర్ఎ నుంచి డిప్యూటీ కలెక్టర్ల వరకు కలిసికట్టుగా ఆటలల్లో పాల్గొంటారనాన్రు. కలెక్టర్లు, ఎస్పీలు, మంత్రులు, రాష్ట్రస్థాయి కమిషనర్లు కూడా గత రాష్ట్రస్థాయి ఉత్సవాల్లో పాల్గొన్న సంప్రదాయం ఉందన్నారు. ఆ సంస్కృతిని ఈసారి కూడా కొనసాగించనున్నట్లు తెలిపారు. వాకింగ్ రేస్, క్యారమ్స్- డబుల్స్, (స్త్రీ,పురుషులు), టెన్నికాయిట్ (స్త్రీలకు మాత్రమే) 45ఏళ్లకు పైబడి వారు ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ కలెక్టర్‌ల స్థాయి అధికారి వరకు పాల్గొననున్నారని తెలిపారు. 45 ఏళ్ల లోపు వారికి 100 మీటర్‌ల డాష్, షాట్‌పుట్, టగ్‌ఆఫ్‌వార్, ఉంటాయని, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, త్రోబాల్, షటిల్ బాడ్మింటన్ సింగిల్స్,డబుల్స్, క్యారమ్స్, చెస్, టెన్నికాయట్ వంటి క్రీడా పోటీలు ఉంటాయని తెలిపారు. కన్నుల పండుగలా నిర్వహించే ఉత్సవాలు జిల్లాలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత హాజరవుతున్నారని తెలిపారు. 26 జిల్లాలతో పాటు సిసిఎల్ఏ యునిట్ ఉద్యోగులతో కలిసి 27 టీములు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. కావున క్రీడా సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేసేందుకు జిల్లాల కలెక్టర్లు సకాలంలో ఉద్యోగులందరినీ 15 రోజులుగానే ముందుగానే పంపించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి అధ్యక్షులు బొప్పరాజు

దసరా కానుక ఇస్తారన్న ఆశ..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా పండుగ కానుకగా పిఆర్‌సి, డిఎ బాకాయిలు, ఆర్థిక అంశాల వంటి సమస్యలు పరిష్కరించి తీపుకబురు చెబుతారన్న ఆశాభావం ఉద్యోగులందరిలో ఉందని బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్యమంత్రి తమ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి నష్టం జరగనీయమనిచెప్పిన వాఖ్యలకు ఉద్యోగులు సంతోషంలో ఉన్నారని తెలిపారు. సిపిఎస్ నుంచి యుపిఎస్ విధానం వచ్చిందని, భవష్యత్‌లో ఓపిఎస్ విధానం ఉద్యోగులకు అమలవుతుందన్న ఆశాభావం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, ఉమ్మడి అనంతపురం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ఎన్.దివాకర్‌రావు, మధునాయక్, కార్యదర్శులు సోమశేఖర్, మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన వారోత్సవాలను విజయవంతం చేయండి

ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న నిరసన వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రెండు రోజులుగా పాఠశాల స్థాయిలో నల్లబ్యాడీల్జు ధరించి నిరసన, రెండవ రోజు మండల కేంద్రాల్లో, మూడవరోజు ప్రజాప్రతినిధులకు ప్రాతినిధ్యాలు, 15వ తేదీ తాలూకా స్థాయిలో నిరసన, 16న జిల్లాస్థాయిలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ కోటగిరి వన్నప్ప, జిల్లా నాయకులు బాలముద్దన్న, కదిరప్ప, ఆంజనేయులు, ఓబులేష్, ఓబన్న, శంకర్‌నారాయణ, నాగరాజు, సురేష్, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి:డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సురేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌ను కలిసి డివైఎఫ్ఐ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం చేరిన పేషెంట్ల దగ్గరకి వెళ్లి వైద్యం చేయకుండా వారిని నర్సింగ్ స్టేషన్‌కు పిలుచుకుని సూదులు, మందులు ఇస్తున్నారన్నారు. అలాకాకుండా అడ్మిట్ అయిన రోగుల బెడ్ దగ్గరికి వెళ్లి వైద్యం అందించాలన్నారు. అదేవిధంగా ఒపి సమయంలో డ్యూటీ డాక్టర్ల దగ్గర ఒక్క బీపీ పరిశీలించే మీటర్ లేదని, డాక్టరు పేషెంట్లను స్టెతస్కోప్‌తో పరీక్ష చేయకుండా కేవలం రోగుల ఆరోగ్య కారణం అడిగి మందులు రాసి ఇచ్చి పంపుతున్నారన్నారు. ఇంజక్షన్ వేసే గది ఒక్కటే ఉందని అలాకాకుండా మహిళలు, పురుషులకు వేర్వేరుగా గదులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు షాషా, నాగిరెడ్డి, సోహేల్, మహిళలు పాల్గొన్నారు.

మళ్లీ త్రిసభ్య కమిటీలే..?

- సహకార సంఘాలకు ఎన్నికలు లేనట్టే
- కమిటీ సభ్యులతోనే పాలన
- రాజకీయ నిరుద్యోగులకు పదవులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వాలు మారినా సహకార సంఘాలకు రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఎన్నికలు మాత్రం నిర్వహించని పరిస్థితి నెలకొంది. సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేసిన పరిస్థితి ప్రస్తుతం కన్పిస్తోంది. 2018 నుంచి ఇప్పటి వరకూ సహకార సంఘాలకు రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీల పేరుతో ప్రభుత్వాలు సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుతో సహకార సంఘాల్లో అవినీతి మరింత పెచ్చు మీరుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కూటమి సర్కార్ సైతం సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు హిందూపురం మండలం కిరికెర పిఎసిఎస్‌కు అధ్యక్షులుగా పి.శంకరప్పతో పాటు నారాయణ రెడ్డి, పి.అన్నెమ్మలను మెంబర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం మండలం గొట్లూరు పిఎసిఎస్‌కు అధ్యక్షులుగా మేకల రామాంజినేయులు, వెంకటేశు, రవి కుమార్‌లను మెంబర్లుగా నియమిస్తు ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ నిర్ణయంపై రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఎన్నికలు ఎగ్గొటి త్రిసభ్య కమిటీలను నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 115 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 5,29,956 మంది సభ్యులుగా ఉన్నారు. జిల్లాలో రైతులకు సహకార సంఘాలు ఎంతో దన్నుగా నిలుస్తున్నాయి. లక్షలాది మంది రైతులు సహకార సంఘాల్లో రుణాలు తీసుకుని వ్యవసాయం సాగిస్తున్న పరిస్థితి ఉంది. సహకార సంఘాలకు రాజ్యాంగ బద్ధంగా ఐదేళ్లకొకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లను అందులోని సభ్యులు తమ ఓటు ద్వారా ఎన్నుకుంటారు. ప్రతి సహకార సంఘానికి 12 మంది వరకు డైరెక్టర్లు ఉంటారు. ఎస్టీ కోటా ఉన్నచోట 13 మందితో కమిటీ ఉంటుంది. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించింది. 2018 జనవరితో వాటి పదవీ కాలం ముగిసింది. అప్పట్లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం సాధారణ ఎన్నికలు దగ్గర పడటంతో పదవీకాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ముందుకు సాగింది. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీని నియమించింది. ఒకరిని ఛైర్మన్‌గా, ఇద్దరు సభ్యులను ఏర్పాటు చేసి ఐదేళ్లు కాలక్షేపం చేసింది. అప్పట్లో దీనిపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. వైసిపి బాటలోనే ప్రస్తుత కూటమి సర్కార్ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి రాగానే వైసిపి ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలను రద్దు చేసి, వాటి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో సహకార ఎన్నికలు జరగడం ఖాయమని అంతా భావించారు. ఏడాది తర్వాత ఎన్నికలకు తిలోదకాలు ఇచ్చేసి త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు పూనుకుంది. ఈ త్రిసభ్య కమిటీల ఎంపికలో టిడిపి, జనసేన, బిజెపి నేతలకే అవకాశం ఇచ్చినట్లు చెబుతున్నారు. త్రిసభ్య కమిటీల నియామకం కారణంగా రైతులకు ఏవిధమైన న్యాయం జరగదని ఇప్పటికే విమర్శలు విన్పిస్తున్నాయి. తాము ఓటు వేసి గెలిపించిన నాయకులను అయితే వెళ్లి నిలదీసే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్‌రావు

ప్రజాశక్తి-అనంతపురం



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.మురళీధర్‌రావు సూచించారు. శనివారం నిగమా ఫౌండేషన్, మై భారత్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్.1 సంయుక్త ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాలలో 'నషాముక్త యువ ఫర్ వికసిత భారత్ కా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మత్తు పదార్థాల నివారణ, మొబైల్ అడిక్షన్‌పై యువతకు అవగాహన కల్పించారు. అనంతరం నషా ముక్త్ యువ ఫర్ వికసిత్‌పై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జి.సోమశేఖర్, కెహెచ్ మైండ్ కేర్ ఆసుపత్రి వ్యవస్థాపకులు గరుగు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్యసౌమ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్ నాయక్, అధ్యాపకులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

వడ్డీతో రుణాలు రెన్యువల్ చేయాలి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో 15న నిరసన

ప్రజాశక్తి-తాడిపత్రి



విలేకరులతో మాట్లాడుతున్న రాజారామిరెడ్డి

రైతుల నుంచి కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని బంగారు రుణాలను రెన్యువల్ చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎపి రైతుసంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనేకమంది రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి డబ్బులు తీసుకోలేక మహిళల బంగారాన్ని వ్యవసాయ అవసరాల కోసం తాకట్టు పెట్టారన్నారు. అయితే కష్టానికి తగ్గ ప్రతిఫలం రాకపోగా నిరంతరం అప్పులే మిగులుతున్నాయన్నారు. అప్పుల భారంతో కొంతమంది రైతులు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకు అధికారులు కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని బంగారు రుణాలను రెన్యువల్ చేయాలని కోరారు. వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలని కోరుతూ ఈనెల 15వతేదీన తాడిపత్రి యూనియన్ బ్యాంకు ముందు నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యురాలు శిరీషా, రాణి, వసుధ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

క్షవర వృత్తిదారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

క్షవర వృత్తిదారులు నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణ క్షవర వృత్తిదారుల సంఘం నూతన కమిటీని పట్టణ ఉపాధ్యక్షుడు శంకర్ అధ్యక్షతన శనివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో నాయీబ్రాహ్మణులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేట్ సెలూన్స్ షాప్‌ల వల్ల సాధారణ దుకాణాల్లో వృత్తినే నమ్ముకున్న జీవిస్తున్న నాయీ బ్రాహ్మణులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు షాపుల వారు బాడుగలు కట్టలేని పరిస్థితి ఉందన్నారు. కావున కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించేంత వరకు ఈనెల 15 సోమవారం నుంచి వివిధ రూపాల్లో ప్రజాసంఘాల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం క్షవర వృత్తిదారుల సంఘం పట్టణ నూతన కమిటీ ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా బ్రహ్మ, సహాయ కార్యదర్శులుగా బాలకృష్ణ, సోమశేఖర్, నవీన్, వంశీ, కుమార్, పరశురాముడు, ఎం.శివకుమార్, ఉపాధ్యక్షులుగా బాల, వాసు, అజయ్, శంకర్, నరేష్‌తో పాటు 11 మందిని కమిటీ సభ్యులుగా, ఐదుగురు ప్రచార కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎఐఎఫ్‌డిఎస్ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యార్థి సమస్యల పరిష్కారమే అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య లక్ష్యమని ఎఐఎఫ్‌డిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, నందు డిమాండ్ చేశారు. అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 77ను రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్‌ఛార్జీలు రూ.3000కు పెంచి మెరుగైన వసతులు అందించాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలను తీసుకొస్తూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి విద్యా విధానాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం దాన్ని అమలు పరుస్తూ నేడు కూటమి ప్రభుత్వం కూడా దాన్ని నిరాటంకంగా కొనసాగిస్తోందన్నారు. స్వాతంత్య్రోద్యమంలో 23 ఏళ్లకే ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ ఆశయాలకు తాము వారసులమన్నారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుళ్లాయిస్వామి, ప్రధాన కార్యదర్శిగా మధు, ఉపాధ్యక్షులుగా సాయి, భాస్కర్, సహాయ కార్యదర్శులుగా మహేష్, వినయ్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా కిరణ్, వంశీ, కార్తీక్, కుమార్, రాకేష్, 11మంది మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

సాయివిజ్ఞాన్ పాఠశాలలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హిందీ భాష గొప్పదనాన్ని హిందీ ఉపాధ్యాయులు చంద్రమోహన్ నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఎంపి శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు జి.లావణ్యారామ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని గూగూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మదన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హిందీ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హిందీ భాష గొప్పదనాన్ని హిందీ ఉపాధ్యాయులు చంద్రమోహన్ నాయక్ వివరించారు. అనంతరం పోటీ పరీక్షల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయురాలు బండి శ్రీదేవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని విజన్ విద్యాసంస్థలో అధినేత విశ్వనాథ్ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ అధ్యాపకులు తహ్రూన్, గైబున్నిసా హిందీ భాష విశిష్టత, గొప్పదనాన్ని వివరించారు. అనంతరం హిందీ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.

విద్యార్థుల లేపాక్షి యాత్ర

లేపాక్షి నంది విగ్రహం వద్ద విద్యార్థులు

ప్రజాశక్తి-రాప్తాడు

శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కళాశాల ప్రాంగణం నుంచి ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు శనివారం లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. భారత సంస్కృతి, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులను యాత్రకు తీసుకెళ్లినట్లు కళాశాల కరస్పాండెంట్ విబిఆర్ శర్మ, ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి, వైస్‌ఛైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి యాత్రలు విద్యార్థుల్లో చారిత్రక పరిజ్ఞానం పెంపొందించడంలో తోడ్పడతాయన్నారు. చదువుతోపాటు వారిలో మానవీయ విలువలు, సామాజిక అవగాహన పెరిగేలా చేస్తాయన్నారు. లేపాక్షి ఆలయంలోని విఖ్యాత విగ్రహ శిల్పాలు, విశేషమైన నంది విగ్రహం, మరియు భగవంతుని తులాభారం వంటి చారిత్రక కళాఖండాలు విద్యార్థులలో విశేష ఆసక్తిని రేకెత్తించాయన్నారు. ఈ యాత్రలో హెచ్‌అండ్ఎస్ విభాగాధిపతి ఎ.చంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నేతలు, ఆటో కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం

ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం కింద రూ.15వేలు ప్రకటించడంతో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆటోడ్రైవర్లు శనివారం నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, లోకేష్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం వారి ఫొటోలతో నృత్యాలు చేస్తూ ఆనందాన్ని వెలుబుచ్చారు. ఈ సందర్భంగా పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు వాహనమిత్ర కింద రూ.15వేలు ఇచ్చేందుకు సిఎం ఆమోదం తెలపడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేష్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి, ఆటో డ్రైవర్లు శబ్రు, రాజు, ఖాసీం, సోము, శ్రీరాములు, చాంద్, షేక్షావలి, గోపీ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ శాస్త్రాల్లో డాక్టర్ సుష్మ ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

ఔషధ శాస్త్రాల్లో జిల్లాకు చెందిన డాక్టర్ సుష్మ ముచ్చుకోట విశేష ప్రతిభ కనబరుస్తూ, పరిశోధనలో నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ప్రతిభను గుర్తించి ఈనెల 12న వెల్స్ యూనివర్సిటీలో జరిగిన 16వ వార్షిక పట్టాభిషేక మహాసభలో ఆమెకు గౌరవప్రదమైన డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ ప్రదానం చేశారు. ప్రస్తుతం ఆమె అధిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, బెంగళూరులో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. డాక్టర్ సుష్మ బహుళ విద్యా ప్రస్థానం, పరిశోధనపై అంకితభావం, సమాజ సేవా దృక్పథం యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించండి

బుక్కరాయసముద్రం : పశువులు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ప్రాంతాయ సహాయ సంచాలయకులు ఎవి రత్నకుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకూ బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో జాతీయ పశు వ్యాధి నివారణ పథకం కింద గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నార్పల : మండల కేంద్రంతోపాటు బి.పప్పూరు పశువైద్యశాలల్లో ఈనెల 15 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు జాతీయ పశు వ్యాధి నివారణ పథకం కింద పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు స్థానిక వెటర్నరీ డాక్టర్లు సాయి సుప్రజా, స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృదుస్వభావి తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి

కుటుంబ సభ్యులకు పలువురి పరామర్శ

భాస్కర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోనేగాక యావత్తు జిల్లా రాజకీయ రంగంలోనే మృదుస్వభావిగా, తిరుగులేని వ్యక్తిగా తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి పేరుపొందారు. అలాంటి భాస్కర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా మరణించడంతో జిల్లా ప్రజానీకానికి దిగ్భ్రాంతి కలిగించింది. 1982-83 మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన నూతనంగా ఏర్పడిన మండలాల ప్రథమంలో ఆత్మకూరు ఎంపిటిసిగా గెలుపొందాడు. అంతేగాకుండా తొలిసారి మండల పరిషత్ అధ్యక్షుడిగా ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తూ వచ్చారు. ఆయన సతీమణి తోపుదుర్తి కవితమ్మను ఆత్మకూరు జెడ్పీటీసీగా గెలిపించుకుని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్థాయికి తీసుకెళ్లారు. అనంతరం వైసిపి ఏర్పడిన తర్వాత తన సోదరుని కుమారుడైన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గెలిపించి ఎమ్మెల్యేను చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. అంతేగాకుండా మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి భాస్కర్ రెడ్డి అత్యంత సన్నిహితుడు. రాజకీయ, సామాజిక సేవారంగాల్లో మంచి పేరు గడించిన తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి గుండెపోటుతో మరణించడం యావత్ జిల్లా మండల ప్రజానీకాన్ని కలిసివేసింది.

నేడు అంతక్రియలు..

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి అంత్యక్రియలను ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం నగరంలోని నివాసంలో ఉన్న ఆయన పార్థివదేహాన్ని ఆదివారం అనంతపురం నుంచి రుద్రంపేట, ఆలమూరు, బ్రాహ్మణ యాలేరు మీదుగా భాస్కర్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తిలోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పార్టీలకతీతంగా నివాళి

అనంతపురం : అనంతపురంలోని స్వగృహంలో ఉన్న తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి పార్థివదేహానికి శనివారం పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రులు రఘువీరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, మాలగుండ్ల శంకర నారాయణ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, పుట్టపర్తి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జేసీ ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి,పెద్దారెడ్డి, సిద్దారెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, తదితరులు భాస్కర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. అనంతరం ఆయన సతీమణి తోపుదుర్తి కవిత, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఇంటి వద్ద నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుందన్నారు.

మహిళకు అత్యంత అరుదైన థైరాయిడ్ క్యాన్సర్

కిమ్స్ సవీరాలో విజయవంతంగా చికిత్స

వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కిన్నెర హరీష్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అత్యంత అరుదుగా వచ్చే థైరాయిడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు విజయవంతంగా చికిత్స చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కిమ్స్ సవీరా ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ ఈఎన్‌టీ, హెడ్‌అండ్‌నెక్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కిన్నెర హరీష్‌కుమార్ వివరించారు. తాడిపత్రి ప్రాంతానికి చెందిన 38 ఏళ్ల మహిళకు కుడివైపు మెడ కొద్దిగా వాచినట్లు అనిపించింది. అది క్రమంగా బాగా నొప్పి పుట్టడంతో నొప్పి నివారణ మందులు వాడారు. అయినా నొప్పి ఎక్కువ కావడంతో ఎందుకిలా జరుగుతోందో ఆమెకు అర్థం కాలేదు. దీంతో అప్పుడు అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రికి వచ్చారు. ఇక్కడ వైద్య పరీక్షలు చేసిన అనంతరం థైరాయిడ్‌లో క్యాన్సర్ వచ్చిందని, అది కుడివైపు మెడలోకి కూడా బాగా విస్తరించిందని తేలింది. ఆమె పరిస్థితి దృష్ట్యా ప్రత్యేక చికిత్సలు అవసరమని గుర్తించి.. రేడియాలజిస్టులతో కూడా సంప్రదించి సరిగ్గా క్యాన్సర్ ఏయే భాగాల్లో ఉందో గుర్తించామన్నారు. మ్యాపింగ్ తర్వాత అత్యంత జాగ్రత్తగా థైరాయిడ్ క్యాన్సర్‌ను పూర్తిగా తొలగిస్తూ అదే సమయంలో మెడలో ఉన్న కీలకమైన నిర్మాణాలను యథాతథంగా ఉంచామన్నారు. దీంతో రోగి పూర్తిగా కోలుకున్నట్లు వివరించారు.

రాజకీయ హడావుడి..!

ప్రజశక్తి - అనంతపురం ప్రతినిధి

జల్లాలో ఈ వారంలో రాజకీయంగా హడావుడి నడిచింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న హామీల అమలుపై పెద్ద సభను నిర్వహించింది. 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' పేరుతో టిడిపి,జనసేన, బిజెపి కలిపి అనంతపురంలో భారీ బహిరంగ సభను నిర్వహించింది. దీన్ని విజవంతం చేయడానికి వారం రోజలకుపైగా అధికారపార్టీ నేతలు పెద్దఎత్తున కసరత్తులు చేశారు. ప్రధానంగా ఐదారుగురు మంత్రులు ఇక్కడే మకాం వేసి నిరంతరంగా ఏర్పాట్లు పరిశీలించారు. పార్టీ సభ అని చెప్పినప్పటికీ జన సమీకరణకు అధికార యంత్రాంగాన్ని భారీగానే వినియోగించారు. ఎన్నికల సమయంలో జరిగే విధంగా ఇప్పుడే సభను పెద్దఎత్తున నిర్వహించడం, జన సమీకరణ చేపట్టడం జరిగింది. ఈ సభ రాయలసీమ వ్యాప్తంగా అని చెప్పినప్పటికీ ఉమ్మడి అనంతపురం జల్లాలోనే ఎక్కువగా జరిగింది. ఇందులో గడిచిన 15 నెలల కాలంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించే ఎక్కువగా చెప్పారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని చెప్పడంతో పాటు వాహనమిత్ర పేరుతో ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామని ఈ సభలో ప్రకటించారు. ఇలా ఎన్నికల ప్రచార కార్యక్రమంలాగా ఈ సభ జరిగిందన్న చర్చ నడుస్తోంది. అమలు చేయని హామీల పరిస్థితి గురించి వైసిపి ప్రశ్నిస్తోంది. ఈ సభకు ఒక రోజుముందు రైతు సమస్యలపై నిరసనలు చేపట్టింది. యూరియా కొరతపైనే కాకుండా మహిళలకు నెలకు రూ.1500 ఇచ్చే కార్యక్రమం వంటివి గురించి ప్ర స్తావించారు. సూపర్ హిట్ సభలో వీటి ప్రస్తావనేదీ రాలేదు. ఇకపోతే హంద్రీనీవా బిటిపి, పేరూరు పూర్తి చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో వర్షాలు కూడా విస్తారంగా పడుతున్నాయి. ఉమ్మడి జల్లా వ్యాప్తంగా అధికంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో వాగులు, వంకల్లోకి నీటి ప్రవాహం కనిపిస్తోంది. ఇప్పటికీ వరకు ఐఎబి సమావేశం నిర్వహించకపోవడం చర్చనీయాంశమైంది. ఈసారి రబీలో ఆయకట్టుకు అయినా నీరు విడుదలపై ఎటువంటి చర్యలుండనున్నాయన్నది తెలియక ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల గడుస్తూ రబీ సీజన్ కూడా ఆరంభం కానుంది. ఒకవైపు ప్రకృతి అనుకూలంగానున్న నిర్దష్టంగా అధికారుల నుంచి చర్యలుండటం లేదన్న విమర్శలున్నాయి. ఇంతలోపే ఉమ్మడి జల్లా కలెక్టర్లు బదిలీ అయ్యారు. అనంతపురం కలెక్టర్ వినోద్ కుమార్, సత్యసాయి జల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ బదిలీ అయ్యారు. వారి స్థానంలో అనంతపురంకు ఆనంద్‌కుమార్, సత్యసాయి శ్యాం ప్రసాద్ వచ్చారు. సత్యసాయి ఎస్పీ రత్నకుమారి కూడా బదిలీ అయ్యారు. ఈ సమయంలో కొత్త వారు బాధ్యతలు తీసుకుని జల్లా పట్ల అవగాహన చేసుకోవడానికే చాలా సమయం పట్టే అవకశముంది. అంతలోపు సీజన్ ముందుకు గడిస్తే మరింత గందరగోళం నెలకొనే అవకాశముంది. ప్రజ ప్రతినిధులు కూడా ఈ అంశాలపై ఈ సమస్య గురించి పెద్దగా స్పందిస్తున్న దాఖలాల్లేవు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సరైన వర్షాల్లేక పంటల్లేకపోయినప్పటికీ ఆగస్టు నుంచి వర్షాలు మొదలయ్యాయి. సెప్టంబర్ మాసంలోనూ మంచి వర్షాలే పడుతున్నాయి. ఈ వారం రోజులుగానూ మంచి వర్షాలు పడుతున్నాయి. దీంతో రబీపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలైనా ఇచ్చి ఉంటే అదును తప్పాక కనీసం ఆ పంటలైనా సాగు చేసుకునేందుకు వీలుండేది. ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ చేపట్టలేదు.

రైతులకు యూరియా పంపిణీ

రాప్తాడు : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు మండలంలోని శనివారం రాప్తాడు ఫెడరేషన్ ఎఫ్‌పిఒ దుకాణానికి 280 బస్తాల యూరియాను సరఫరా చేశారు. ఇపిఒఎస్ విషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో పంపిణీ చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అందుబాటులోకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం మండలంలోని గొందిరెడ్డిపల్లిలో నిర్వహించిన ఈపంట నమోదు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ గంగుల కిష్టప్ప, మండల ఉపాధ్యక్షుడు జూటూరు రామకృష్ణ, వ్యవసాయ అధికారి ఎస్.కృష్ణచైతన్య, ఎఇఒ సుజిత, ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జి గిరిధర్ గంగరాజు, రైతులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళి

గుత్తి : కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణ శివారులోని సిపిఎం కాలనీలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవతి, ఎన్.రేణుక, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు : మండల పరిధిలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన శ్రీధర్, గంగలాపురం పాఠశాల శ్రీరాములు, గోపులాపురం పాఠశాల సరితల రవీంద్ర, హనకనహల్ పాఠశాల ఉపాధ్యాయులను శనివారం మండలంలోని కొండారెడ్డి పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అలాగే వెంకటేషులు అనే ఉపాధ్యాయునికి మండలంలోని ఉపాధ్యాయులందరూ కలిసి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నిక చేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె.లక్ష్మణ్, ఎపిటిఎఫ్ గౌరవాధ్యక్షులు శేషారెడ్డి, కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు పరమేశ్వరప్ప, జయరామిరెడ్డి, శివారెడ్డి, సూర్యకాంతరెడ్డి, దావూద్, రామ్మోహన్‌గౌడ్, కుళ్లాయిస్వామి, చిన్న వెంకటేశులు, నక్కా నాగరాజు, అన్నపూర్ణ, రోకయ్య, వాణి, తదితరులు పాల్గొన్నారు.

15న ఓపెన్ డే

అనంతపురం : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఈనెల 15వతేదీన సోమవారం ఓపెన్ డే నిర్వహించనున్నట్లు జెఎన్‌టియు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను అన్వేషించడానికి, ప్రత్యక్ష ప్రదర్శనలను చూడటానికి, ఇంజినీరింగ్‌లోని వివిధ శాఖల్లో సుసంపన్నమైన అనుభవాలను పొందడానికి ఓపెన్ డే చాలా ఉపయోగపడుతుందన్నారు.

నిజాయితీ చాటుకున్న విఆర్ఎ

గుత్తి : ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సు లభ్యం కావడంతో అతని చిరునామా తెలుసుకుని తిరిగి శనివారం అతనికి అప్పగించిన ఓ విఆర్ఎ నిజాయితీని చాటుకున్నాడు. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో నివాసం ఉండే సూరిపోగుల జగదీష్ గ్రామ రెవెన్యూ సహాయకుడిగా పని చేస్తున్నాడు. విధులు నిమిత్తం కార్యాలయం వద్దకు వెళ్లగా అతనికి కింద పడ్డ ఓ పర్స్ లభించింది. అది తీసుకుని చూడగా అందులో నగదు, ఎటిఎంతోపాటు గుర్తింపు కార్డులు ఉన్నాయి. గుర్తింపు కార్డులను పరిశీలించి మండలంలోని వన్నెదొడ్డి గ్రామానికి చెందిన కె.కృష్ణమూర్తి కుమారుడైన కె.శ్రీనివాసులు ఎల్ఐసి ఏజెంట్‌గా గుర్తించాడు. ఫోన్ ద్వారా సంప్రదించి పోగొట్టుకున్న పర్సును గుత్తిలో అతనికి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. విఆర్ఎ నిజాయితీని పలువురు అభినందించారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత : సిడిపిఒ

బ్రహ్మసముద్రం : ఆడపిల్లలను సంరక్షించడం మనందరి బాధ్యత అని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న పిలుపునిచ్చారు. శనివారం గురుకుల పాఠశాలలో ఐసిడిఎస్, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన, పోక్సో, బాలల హక్కులు, పిల్లల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ పిల్లల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. అనంతరం సమాజంలో పిల్లల రక్షణపై అవగాహన పెంచాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణానాయక్, ప్రిన్సిపాల్ శీలాసౌజన్య, హెచ్ఎస్ఎస్ కిరణ్‌కుమార్, ఎఎన్ఎం వరలక్ష్మి, రిడ్స్ సిబ్బంది నాగరాజు, లక్ష్మీదేవి, మారక్క, తిప్పేరుద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కళ్యాణదుర్గం రూరల్ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రిడ్స్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కెజిబివి పాఠశాలలో హెచ్ఐవి, ఎయిడ్స్, టీబీపై అవగాహన అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులపై వివక్షత చిన్నచూపు లేకుండా ఎలా కలిసి జీవించాలి, క్షయ వ్యాధి సంబంధం గురించి, సుఖవ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగాలు వంటి వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో రిడ్స్ మేనేజర్ మహేష్, ప్రిన్సిపాల్ నాగజ్యోతి, ఎఎన్ఎం గీత, కిరణ్ కుమార్, వరలక్ష్మి, రీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

యాడికి : మండల పరిధిలోని చందన గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య రాష్ట్ర పరిశీలకురాలు శైలజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలు ప్రజలకు ఎలా చేరుతున్నాయి.. ఆరోగ్య విద్య ఎలా చెబుతున్నారనే విషయాలతోపాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత జూమ్ ద్వారా ఇక్కడి పరికరాలు, గోడలకు తగిలించిన సమాచారం పోస్టర్లు, రికార్డులను చూపించారు. అదేవిధంగా అన్ని ఉపకేంద్రాల్లో రికార్డుల పరికరాలు, డిస్‌ప్లే బోర్డులను సమక్రమంగా నిర్వహినంచాలని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దేవరాజన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షబ్బీర్, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.కవిత, శివచంద్రకుమారి, ఎఎన్ఎం సబితా, రజని, అనిత, దమయంతి, శివగంగా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

గుత్తి : పట్టణంలోని మృతుని కుటుంబానికి టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి శనివారం ఆర్థికసాయం చేశారు. స్థానిక 16వ వార్డు కేయం ఫంక్షన్ హాలు సమీపంలో నివాసం ఉండే లక్ష్మయ్య శుక్రవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంకే.చౌదరి మృతుని నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డ్ టిడిపి ఇన్‌ఛార్జి సరోజ, నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 491 కేసులు పరిష్కారం

రాయదుర్గం : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలతో 491 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి కె.భాను తెలిపారు. వీటిలో 15 ఐపిసి కేసులు, 55 ఎక్సైజ్ కేసులు, ఒకటి ఎంసి కేసు, 420 ఎస్‌టిసి కేసులు ఉన్నాయన్నారు.

ఎఐఇఇఎలో ఎస్.సునీల్‌కుమార్ ఉత్తమ ప్రతిభ

గుత్తి : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్స్ (ఎఐఇఇఎ) పరీక్ష ఫలితాల్లో మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన సూరిపోగుల సునీల్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. గ్రామానికి చెందిన ఎస్.వీరార్జున, సుజాత దంపతుల కుమారుడు ఎస్.సునీల్‌కుమార్ ఈ ఏడాది జూన్ 3వ తేదీన జరిగిన ఎఐఇఇఎ పరీక్షల్లో 480 మార్కులు 232 మార్కులతో ఉత్తమ ప్రతిభను కనబరిచి ఆలిండియా స్థాయిలో 44వ ర్యాంకు సాధించాడు. ఎస్సీ కేటగిరీలో 7వ ర్యాంకు సాధించాడు. ఆర్డీటీ సహకారంతోనే తాను చదువుల్లో రాణించానని సునీల్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి : మున్సిపాలిటీలోని 220 కెవి స్విచ్చింగ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.పద్మనాభపిళ్ళై తెలిపారు. శనివారం స్థానిక విలేకలతో మాట్లాడుతూ స్విచ్చింగ్ స్టేషన్‌లో పాత బ్రేకర్లు, సిటీలు, సివిటిలు, సిఅండ్ఆర్ ప్యానళ్లు కొత్త వాటితో మార్చే పనులు చేపడతామన్నారు. 220 కెవి గుత్తి ఆర్ఎస్ ఫీడర్, ఆర్ టిఎస్ఎస్ లీడర్లపై లైన్ క్లియరెన్స్ తీసుకుంటామన్నారు. ఆ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో ఐదు రోజులపాటు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ఆత్మకూరు : మండలంలోని పలువురు బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్ చెక్కులను శనివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అందజేశారు. ఈ కార్యక్రంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్యశిబిరం

నార్పల : మండల కేంద్రంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్ర స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అనంతపురానికి చెందిన ప్రఖ్యాత్ డెంటల్ ఆసుపత్రి వారు దం పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

టైరు కింద పడి మృతిచెందిన శంకరయ్య

పెద్దపప్పూరు : ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ శంకరయ్య (47) మృతిచెందిన ఘటన శనివారం మండల పరిధిలోని షేక్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చిక్కేపల్లి గ్రామానికి చెందిన కురుబ శంకరయ్య కంప్రెషన్ ట్రాక్టర్‌తో పెద్దపప్పూరుకు వెళ్తుండగా షేక్‌పల్లి సమీపంలోకి రాగానే స్పీడ్ బ్రేకర్‌ను తప్పించబోయి అదుపు తప్పడంతో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడి శంకరయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై శనివారం రెండు ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంద గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొందిపల్లి గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డి పని నిమిత్తం రాయలచెరువుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తుండగా జక్కలచెరువు గ్రామ -శివారులో గుత్తి నుంచి యాడికి వెళ్తున్న దంపతుల ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో పద్మనాభరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు. ఇదే ప్రమాదంలో గాయలైన యాడికి ఆసుపత్రి కాలనీకి చెందిన దంపతులకు గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం బంధువులు తాడిపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోలో నుంచి పడి వ్యక్తికి..

గుత్తి మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో శనివారం ఆటోలో నుంచి జారి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు గుత్తి పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలో నివాసం ఉండే గిరిబాబు పత్తికొండలో బంధువుల ఇంటికి పని నిమిత్తం వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని ఆటోలో గుత్తికి బయలుదేరాడు. అయితే బసినేపల్లి గ్రామ శివారు పెద్ద వంక వద్ద మలుపులో ఆటోలో పక్కన కూర్చున్న గిరిబాబు చేయి జారి రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలైన గిరిబాబును అదే ఆటోలో వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.